క్లుప్తంగా

ఏకగ్రీవంగా ఆర్యవైశ్య నూతన కమిటీ


దోర్నాదుల సురేష్‌బాబు


చిన్ని సుధీర్‌బాబు


డాక్టర్ మెంటా సందీప్

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో సత్రం సెంటర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సమావేశం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకునేందుకు చర్చలు జరిపి ఏకగ్రీవంగా కమిటీని ఎంపిక చేశారు. ఆర్యవైశ్య దేవస్థానం చైర్మన్‌గా దోర్నాదుల సురేష్‌బాబు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా చిన్ని సుధీర్‌బాబు, యువజన సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ మెంటా సందీప్‌తో పాటు పలువురిని అభినందించారు.

ఎల్ఐసీలో ఆరు కొత్త పాలసీలు


ఎస్‌డీఎంను సన్మానిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

ఉదయగిరి: ఎల్ఐసీలో ఈ ఆర్థిక సంవత్సరానికి ఆరు కొత్త పాలసీలను ప్రవేశ పెట్టిందని ఎస్‌బీసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఆర్‌కే రవికుమార్ అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా వృద్ధులు, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని నూతన పాలసీలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ప్రతి వ్యక్తికి జీవిత బీమా పథకం ఉండేలా చూడాలన్నారు. అనంతరం బీమా పాలసీల విక్రయంలో ప్రతిభ కనపరచిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు కార్యాలయ మేనేజర్ మెహర్‌కుమార్, టీం లీడర్ మునీశ్వరయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయండి



ఆత్మకూరు: ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు ఇబ్బంది కలిగేలా సీపీఎస్ విధానం ఉందని, దానిని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల సభ్యులు కోరారు. ఆదివారం పలు పార్టీలకు వినతి పత్రాలు అందజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అందులో భాగంగా సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు డేవిడ్‌రాజు, లక్ష్మీపతిలకు వినతి పత్రం అందజేసి తమ సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం గంగాధర్, జిల్లా మాజీ కార్యదర్శి శివప్రసాద్‌రావు, ఆత్మకూరు శాఖకు చెందిన ఖాదర్‌బాషా, హరికృష్ణ, మురళీకృష్ణ, మస్తాన్, శ్రీరాములు, పెంచలయ్య, షఫీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లబ్ధిదారులకు అందిన చెక్కులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులు లేటి విజయలక్ష్మికి రూ.65 వేలు, కరేటి సునీతకు రూ.10 లక్షలు, కప్పల నవీన్ కుమార్‌కు రూ.80 వేలు వంతున సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మేకపాటి విజయీభవ యాత్ర

అనుమసముద్రంపేట: మండలంలోని తాతిరెడ్డిపల్లి, పుట్టువారిపల్లి, రాజవోలు గ్రామాల్లో సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజయీభవయాత్ర నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పల్లెకు సంక్షేమ భరోసా

డీబీటీ ద్వారా రూ.14.40 కోట్లు అందజేసిన ప్రభుత్వం

- స్వతంత్రంగా ఎదుగుతున్న పేద కుటుంబాలు
- వేలాది మంది సామాజికంగా ఎదుగుదల

అదొక చిన్న ఊరు. ఆ ఊరుకు సంక్షేమ భరోసా లభించింది. రెండు వేల లోపు ఓటర్లు ఉన్న ఆ పల్లెలో వేల మందికి రూ.కోట్లల్లో సంక్షేమ ఫలాలు అందాయి. పేద ప్రజలు బతకడానికి కూలీనాలి చేసుకుంటే వచ్చే ప్రతిఫలానికి తోడుగా సంక్షేమ పథకాల ఫలాలు ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మార్చేశాయి. గతంలో ప్రతి అవసరానికి అప్పులు చేసే పేద కుటుంబాలు.. ప్రస్తుతం తమ ఖాతాల్లోని బ్యాలెన్స్‌తో అవసరాలు తీర్చుకుంటున్న పరిస్థితికి చేరారు. సమాజంలో సామాజిక విలువ పెరిగింది.



పేదల జీవితాల్లో వెలుగులు

మండలంలోని డీసీపల్లి గ్రామానికి చెందిన తవ్వా నాగజ్యోతి. పొదుపు సంఘం గ్రూపు సభ్యురాలు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రుణం తీసుకుని జ్యూస్ వ్యాపారం మొదలుపెట్టింది. ఈ వ్యాపారానికి ప్రభుత్వ సహకారంతో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.47 వేలు సున్నా వడ్డీ ద్వారా రూ.9 వేలు, రైతు భరోసా ద్వారా రూ.45,500, అమ్మఒడి పథకం ద్వారా రూ.42 వేలు సహకారం లభించడంతో వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకుంది. తద్వారా మరింత అభివృద్ధి చెందడంతో రాబడి పెరిగింది. తన పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటోంది. తన కుటుంబం ఆర్థికంగా బలపడేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుందని, ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు.



డీసీపల్లిలోని సచివాలయ భవనం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి గ్రామం. 2,500 మంది జనాభా.. 1,931 మంది ఓటర్లు ఉన్న ఆ పల్లెల్లో పేదరిక ఛాయలు మాయం అయ్యాయి. పేదల జీవన ప్రమాణాలు క్రమక్రమంగా మెరుగుపడుతున్నాయి. గతంలో ప్రతి కుటుంబం నెలకు వేలల్లో ప్రభుత్వ సేవల కోసం ఖర్చు పెట్టుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేకపోవడంతో పేదలకు ఆ అదనపు ఖర్చులు తగ్గడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలతో ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తూ.. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎదుగుతున్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మండలంలోని డీసీపల్లి గ్రామంలో పేదలకు గడిచిన 57 నెలల్లో సంక్షేమాభివృద్ధికి డీబీటీ రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.14.40 కోట్లకు పైగా జమ చేశారు. ఇప్పుడు ప్రతి గడప మురిసిపోతోంది. గతంతో పోల్చుకుంటే.. ఆనాటికి.. ఈ రోజుకు తమ ఆర్థిక ప్రగతిపై బేరీజు వేసుకుంటున్నారు.

ఇప్పటి వరకు అందచేసిన సంక్షేమ పథకాలు

పథకం	లబ్ధిదారులు	మంజూరైన మొత్తం (రూ.ల్లో)
వైఎస్సార్ ఆసరా	551	93,33,424
అమ్మఒడి	250	9,04,50,000
అర్చకులకు	6	30,000
జగనన్న చేదోడు	10	1,50,0000
ఈబీసీ నేస్తం	87	13,05,000
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	24	3,44,296
జగనన్నతోడు	45	15,016
జగనన్న వసతిదీవెన	88	13,63,314
జగనన్న విద్యాదీవెన	158	52,57,910
కాపు నేస్తం	16	4,20,000
పింఛన్లు	420	3,02,58,750
రైతు భరోసా	459	1,53,87,000
సున్నా వడ్డీ పంటరుణాలు	54	1,11,790
వైఎస్సార్ సున్నావడ్డీ	588	16,93,864
వాహనమిత్ర	12	2,60,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	19	1,33,900
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	31	12,98,227
వైఎస్సార్ బీమా	7	7,20,000
వైఎస్సార్ చేయూత	97	31,31,250
గడప గడపకు మన అభివృద్ధి నిధులు	4	40,00,000

ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహించింది



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఒక్క రూపాయి అవినీతికి తావులేకుండా ప్రభుత్వం ఆర్థికంగా ప్రోత్సహించింది. ఇప్పటి వరకు వైఎస్సార్ చేయూత ద్వారా రూ.56,250 వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.3,535, ప్రతి నెల నాకు సామాజిక పింఛను అందజేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో మా జీవితాల్లో వెలుగులు వచ్చాయి. ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– నల్లిపోగు పుల్లమ్మ, డీసీపల్లి

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వింజమూరు (ఉదయగిరి): నెల్లూరులోని వీకేఎస్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో కలర్ డిటెక్ట్ టెస్ట్‌లో వింజమూరు విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచారు. ఎం.నిఖిల్, ఆర్య, పి.మైథిలి రెడ్-1 బెల్టు సాధించారు. మిగతా వారు ఎల్లో, గ్రీన్ బెల్టులు సాధించారు. నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.శ్రీనివాసులు, నేషనల్ తైక్వాండో రెఫరీ ఎం.లక్ష్మీనారాయణ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బెల్టులు అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన నేషనల్ కోచ్ జి.జెరుబ్బాబే కూడా అభినందించారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బాలాజీ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 5.30 వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మధ్యాహ్నం సంగం, చేజర్ల, కలిగిరి, మంగళవారం ఉదయం వింజమూరు, ఉదయగిరి, సీతారామపురం, మధ్యాహ్నం దుత్తలూరు, మర్రిపాడు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసిచూపిస్తా


సమావేశానికి భారీగా తరలి వచ్చిన నేతలు, కార్యకర్తలు


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డిలను పూలమాలలతో సన్మానిస్తున్న పార్టీ అభిమానులు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- బెంగళూరులో ఉదయగిరి వాసులతో ఆత్మీయ సమావేశం

ఉదయగిరి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి ఓటర్లు తనను ఆదరించి గెలిపిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. బెంగుళూరులోని వైట్ ఫీల్డ్‌లో ఉన్న తన నివాసంలో ఆదివారం బెంగళూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంతాన్ని మేకపాటి కుటుంబం గత ముప్పై ఐదేళ్ల నుంచి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న విషయం గుర్తు చేశారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి కావాలంటే ఒక్క మేకపాటి కుటుంబంతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే.. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకొస్తే ఉదయగిరి మెట్ట ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సోమశిల, వెలుగొండ జలాలు పారిస్తామన్నారు. తాను సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్ల ప్రభుత్వ చేసే సంక్షేమం అభివృద్ధి గురించి వివరిస్తున్న సమయంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి గడప గడపకూ మన ప్రభుత్వంలో కార్యక్రమానికి అధిక నిధులు కావాలని కోరగానే రాష్ట్రంలో ఏ నియోజక వర్గానికి ఇవ్వని విధంగా మన ఉదయగిరి నియోజక వర్గానికి ప్రతి సచివాలయానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేస్తున్నట్లు చెప్పారు. టీడీపీలోకి ఫిరాయించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నిజ జీవితంలో, రాజకీయాల్లో క్యారెక్టర్ లేదని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేమిరెడ్డికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన పార్టీ మరడంపై అభిమానించిన ప్రజలే ఛీకొడుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ ఉదయగిరిలోని తమ స్వగ్రామాలకు వచ్చి ఒక నాయకుడిలాగా పనిచేసి వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డితో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఆయన ద్వారానే నేను ఈ స్థాయిలో ఉన్నానని, మేకపాటి కుటుంబం మంచిని జీవితంలో మరువనన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను కూడా ఉదయగిరిలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని చెప్పారు. రాజగోపాల్‌రెడ్డిని ఎమ్మెల్యేగా, జగన్‌ను రెండో సారి సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఈ నలభై ఐదు రోజులు దీక్షతో పని చేయాలని కోరారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ యువ నాయకుడు అభినవ్‌రెడ్డి, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.5 లక్షలు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని నందవరంలో కొలువైన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తమ సొంత నిధులు రూ.5 లక్షలు అందజేశారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో నందవరం వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్, ప్రసాద్‌కు విరాళం చెక్కును అందజేసి ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇటీవలే ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ట, నవగ్రహ సహిత జీవధ్వజ, కుంభాభిషేక, నాగప్రతిష్ట కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకపాటి తన తండ్రి మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆ సమయంలో గ్రామస్తుల కోరిక మేరకు అభివృద్ధి పనుల కోసం సొంత నిధులు అందజేస్తామని తెలిపి ఆ మేరకు ఆదివారం రూ.5 లక్షలు చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయించారని, ప్రస్తుతం దేవదాయశాఖ ద్వారా కామన్‌గుడ్ ఫండ్ కింద రూ.5 లక్షలు, తమ సొంత నిధులు రూ.5 లక్షలు అందించి ఆలయ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందించామన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో బోగోలు మండలానికి చెందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ఆదివారం సమావేశమయ్యారు. ప్రతి నెలా ఒకటో తేదీన పొద్దుపొడవకముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో వలంటీర్లు చేస్తున్న కృషి ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందన్నారు. రాజకీయాలకు అతీతంగా, అవినీతికి అవకాశం లేకుండా వలంటీర్లు పారదర్శంగా పని చేస్తున్నారని అభినందించారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వలంటీర్లు చేస్తున్న కృషి మరువలేమని తెలిపారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బోగోలు మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

మున్సిపల్ వాహనాలకు మరమ్మతులు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో చెత్తను సేకరించే వాహనాలతో పాటు కాలువల్లో మురుగును తొలగించే చిన్న జేసీబీ మరమ్మతులకు గురికావడంతో కమిషనర్ షేక్ ఫజులుల్లా వాటికి ఆదివారం మరమ్మతులు చేయించారు. గత ఐదేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఈ వాహనాలు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురై మున్సిపల్ కార్యాలయంలో ఓ పక్క నిలిపివేశారు. ఇటీవల బదిలీపై వచ్చిన కమిషనర్ ఫజులుల్లా వాటిని పరిశీలించి గుంటూరు నుంచి మెకానిక్‌లను పిలిపించారు. చిన్నపాటి మరమ్మతులు చేయించారు. వాటిని సోమవారం నుంచి ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందితో పాటు పలు పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజల వాహనాలు, పార్కింగ్ చేసేందుకు కార్యాలయ ప్రాంగణంలోని ఓ వైపు రేకుల షెడ్డు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట ఏఈ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.


ఆత్మకూరు మున్సిపల్ వాహనాలకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

అలరించిన చిన్నారుల ప్రదర్శనలు


సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆదివారం పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాలకొండరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి, వెన్నవాడ, ఆరవేడు, సాతానుపల్లి హెచ్‌ఎంలు రవీంద్రకుమార్, శ్రీనివాసులు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన

కావలి: పట్టణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, సేవియర్స్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళా రక్తదాతలను, రక్తదానంపై అవగాహన కలిగించే మోటివేటర్లను ఆదివారం ఘనంగా సత్కరించారు. మహిళలతో ప్రత్యేకంగా రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదానం ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కలిగించారు. సేవియర్స్ మహిళా విభాగం సభ్యురాలు సౌందర్య దీపిక మాట్లాడుతూ మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు మహిళా దినోత్సవాల్లో భాగంగా మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవియర్స్ సభ్యులు దివ్య, శ్రావ్య, నవ్య, ప్రవంతి, పూజిత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జీవితానికి రెండు పోలియో చుక్కలు


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పక వేయించాలని, పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడేందుకు ప్రభుత్వం పల్స్‌పోలియో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రతి ఒక్కరూ తమ చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించేలా చూడాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం

ఆత్మకూరు: పోలియో రహిత సమాజం నిర్మించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు. పట్టణంలో అర్బన్ వైద్యురాలు డాక్టర్ అస్మా ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పలు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 6 గంటల నుంచే పోలియో చుక్కలు వేసే కార్యక్రమం మొదలుపెట్టారు. ఆత్మకూరులో తొలి రోజు ఆదివారం 98.6 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

98.59 శాతం పోలియో చుక్కలు

ఉదయగిరి: మండలంలోని పల్స్‌పోలియో కేంద్రాల్లో ఆదివారం వైద్య ఆరోగ్య సిబ్బంది 3,554 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 98.59 శాతం సాధించినట్లు మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన అన్నారు. ఆమె పలు పోలియో కేంద్రాలను తనిఖీ చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 3,605 మంది చిన్నారులకు చుక్కలు వేయాల్సి ఉంది. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికి తిరిగి చుక్కలు వేయడం జరుగుతుందన్నారు.

జలదంకి: మండలంలోని జలదంకి, గట్టుపల్లి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. జలదంకి పీహెచ్‌సీ పరిధిలో 97.1, గట్టుపల్లిలో 98.7 శాతం పల్స్‌పోలియో నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

కలిగిరి: మండలంలో 97 శాతం మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి ఆదివారం తెలిపారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పల్స్ పోలియో నిర్వహణను రాష్ట్ర స్థాయి పర్యవేక్షణాధికారి కే శివశంకర్ బాబు పరిశీలించారు.

వరికుంటపాడు: మండలంలో ఆదివారం జరిగిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 97 శాతం మంది చిన్నారులకు వైద్య ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారులు కరీష్మా, ఆయేషా తెలిపారు.

పల్స్ పోలియో చిన్నారులకు రక్ష

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం చిన్నారుల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని భారత రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. తన స్వగ్రామం మండలంలోని మహిమలూరులో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలి, ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి అనూషాకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.